క్లుప్తంగా

కొనసాగుతున్న నిరసన



నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసన మంగళవారం కొనసాగింది. ఈసందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

వేదశ్రీకి నివాళి



నివాళి అర్పిస్తున్న పోలీసులు

రామడుగు: రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ వేదశ్రీ మృతి చెందారు. ఆమె మృతి పోలీస్‌శాఖకు తీరని లోటని రామడుగు ఎస్సై అంజయ్య అన్నారు. రామడుగు పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లపాటు సేవలు అందించి ప్రజల మన్ననలు అందుకుందన్నారు. అనంతరం వేదశ్రీ చిత్రపటానికి ఎస్సై, పోలీసు సిబ్బంది నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై అనంతరెడ్డి, జీవన్‌రెడ్డి, పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై నాట్లు వేసి నిరసన



నాట్లు వేస్తున్న నాయకులు

చొప్పదండి: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో మంగళవారం గుంతల రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. కోనేరుపల్లి నుంచి గుమ్లాపూర్ బ్రిడ్జి వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్లాపూర్ రోడ్డులోని బ్రిడ్జి నుంచి కోనేరుపల్లి శివారులోని బ్రిడ్జి వరకు తారురోడ్డు వేసి రామడుగు, చొప్పదండి, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవ్వంపల్లి అజయ్, గజ్జల మల్లేశం, గజ్జల శ్రీహరి, గజ్జల రాజలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



మ్యాకల భీరేశ్

రామడుగు: రామడుగు మండల కురుమ యువ చైతన్య సమితిశాఖ అధ్యక్షుడిగా మ్యాకల భీరేశ్‌ను నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా భీరేశ్ మాట్లాడుతూ.. మండలంలో కురుమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎమ్మార్పీఎస్‌టీఎస్ మండల కన్వీనర్‌గా వీరయ్య



రాగటి వీరయ్య

గన్నేరువరం: ఎమ్మార్పీఎస్‌టీఎస్ గన్నేరువరం మండల కన్వీనర్‌గా మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన రాగటి వీరయ్య జిల్లా కమిటీ ఉత్తర్వుల మేరకు నియామకమయ్యారని జిల్లా ప్రధాన కార్యదర్శి, తిమ్మాపూర్ మండల ఇన్‌చార్జి తాటిపల్లి బాబు తెలిపారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో సమావేశం నిర్వహించారు. వర్గీకరణ కోసం జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో తిమ్మాపూర్ మండల కన్వీనర్ అలువాల రవీందర్, కల్లెపల్లి కొమురయ్య, కల్లెపల్లి మల్లయ్య, నగునూరి మల్లయ్య, గొర్రె శంకర్, నగునూరి స్వామి, కల్లెపల్లి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు

- కోతుల దాడులు.. జనం పరుగులు
- ఇంటి పైకప్పులు, కూరగాయల తోటలు ధ్వంసం
- రక్షించాలని వేడుకుంటున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బేతిగల్ గ్రామంలోని ఓ ఇంటిపై కోతుల గుంపు

వీణవంక: క్వారీల పేరుతో గుట్టలు కరిగిపోతున్నాయి...బీడు భూములు పొలాలుగా మారాయి. అడవులు, గుట్టల్లో ఉండాల్సిన కోతులు ఇప్పుడు ఊళ్లపై పడుతున్నాయి. తలదాచుకునే స్థావరాలు ధ్వంసం కావడంతో చేసేదిలేక ఇళ్లు, పంటలపై దాడులు చేస్తున్నాయి. దొరికనకాడికి ఎత్తుకెళ్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు గుంపులు గుంపులుగా ఒక్కసారిగా ఎగబడుతూ జనాలను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఊరూ..వాడ ఉరికిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే చిన్నపాటి దండయాత్రే చేస్తుండటంతో వీణవంక మండల ప్రజలకు కోతుల భయం పట్టుకుంది. వీటి బారి నుంచి రక్షించండంటూ వేడుకుంటున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 1,7650 కుటుంబాలు ఉన్నాయి. ఏ క్షణంలో కోతులు ఎటు నుంచి దండెత్తుతాయే తెలియక జనం జంకుతున్నారు. ఇంటి పైకప్పులను పీకేస్తున్నాయి. ధాన్యం, ఇతర పప్పు దినుసులు ఆరబోస్తే అంతే సంగతులు. గుంపుగా వచ్చి చిందరవందర చేస్తున్నాయి. కూరగాయల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. వీటి బెడద తట్టుకోలేక మండల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

దాడి చేసిన సంఘటనలు

- కనపర్తి గ్రామంలో ఓ చిన్నారి(5)ఆరుబయట ఆడుకుంటుండగా కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. కోతుల నుంచి కాపాడుకునే ప్రయత్నంలో చిన్నారి డ్రైయినేజీలో పడటంతో గాయాలయ్యాయి.
- చల్లూరుతో వృద్ధురాలు కిరాణా షాపుకు వెళ్తుండగా కోతులు దాడి చేయడంతో గాయాల పాలైంది. ఇదే గ్రామంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకులపై దాడి చేయగా అదుపు తప్పి కిందపడగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

తలదాచుకునే స్థావరాలు కరువు

చల్లూరు, కోర్కల్, బేతిగల్, కల్వల గ్రామాల్లోని గుంటలు క్వారీల పేరుతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. బండరాయి కోసం పగలు, రాత్రి తేడా లేకుండా డిటోనేటర్లు పేల్చుతుండటంతో వాటి శబ్దాలకు కోతులు గ్రామంలోకి చొరబడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తలదాచుకునే స్థావరాల్లేక గ్రామాలల్లోకి వచ్చి చిందరవందర చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలి

ఇంటి పరిసరాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని, అదేవిధంగా మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

భయమేస్తోంది



కోతులు గుంపుగా వస్తుండటంతో భయమేస్తోంది. ఇంటి పైకప్పును ధ్వంసం చేస్తున్నాయి. ఇంటిముందు ఏం ఆరబోసిన చిందరవందర చేస్తున్నాయి. సైకిల్‌పై కిరాణా షాపుకు వెళ్తుంటే కోతులు వెంటపడగా తృటిలో తప్పించుకున్నా. ఏదైనా కూరగాయలు పెడదామంటే కొరికేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలి.

– గొట్టె నందయ్య, బేతిగల్

సీఎం కేసీఆర్‌ను కలిసిన వీవీఆర్



రామడుగు: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం నూతన సెక్రటేరియట్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

కొండాపూర్‌లో ఎల్లమ్మ బోనాలు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌లో మంగళవారం ఎల్లమ్మబోనాలు నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడుఅంజనేయులు, సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ పద్మ, బీజేపీ నాయకుడు అజయ్‌వర్మ, వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిల్లల పోషణపై దృష్టి సారించాలి

అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్



బాలామృతం అందిస్తున్న రాజేశ్వర్‌రావు

చొప్పదండి: పిల్లల పోషణపై దృష్టి సారించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న బాలామృతం, ఇతర పోషక పదార్థాలను చిన్నారులకు తప్పనిసరిగా అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. మండలంలోని ఆర్నకొండలో మంగళవారం పర్యటించారు. పిల్లల పెరుగుదల పరిశీలనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. పోషణ లోపంతో బాధపడుతున్న వారితో మాట్లాడారు. ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, మిల్లెట్స్, బాలామృతం విశిష్టతను వివరించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన అనీమియా ముక్త్ కరీంనగర్‌లో భాగంగా పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం అడిగి తెలుసుకున్నారు. మహిళలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించే హెల్త్ డైరీని ప్రతి మహిళ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో వినీత, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీఆర్‌డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీపీ చిలుక రవీందర్, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో స్వరూప, సర్పంచ్ దామెర విద్యాసాగర్ రెడ్డి, ఎంపీటీసీ సునంద, సూపర్‌వైజర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో పిల్లల్లో ఎదుగుదల

జమ్మికుంట: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన ఆహారం అందిస్తోందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధి 21వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం ప్లస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారంతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని, ఎత్తుకు తగ్గ బరువు పెరిగే విధంగా ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దిడ్డిరాము, రాయికంటి రాజు, సారంగం, భోగం వెంకటేష్, సుపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్ పొనంటి కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పనిచేస్తున్న సిబ్బంది, హమాలీలకు మంగళవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దుస్తులు అందజేశారు. ధాన్యం అమ్ముకోవడానికి వస్తున్న రైతులకు తగిన వసతులు కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ అండగా నిలుస్తుందన్నారు. దుస్తుల పంపిణీ కార్యక్రమంపై స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడుబాలాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు గంగన్న, నర్సయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణానికి చెందిన సీహెచ్ అంజలి అనే చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంగళవారం అందించారు. మండలానికి చెందిన 12 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని గుమ్లాపూర్ గ్రామం వెంకటేశ్వర మన్మయ సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు ఉదారం వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడు కస్ప సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మంథెన లక్ష్మణాచారి, ప్రధాన కార్యదర్శి మంథెన వేణు, ఉదారం తిరుపతిచారి, నాగభూషణం, చంద్రమౌళి, దక్షిణామూర్తి, గంగాచారి, మహేశ్ చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్ రెడ్డి, వెల్మ రఘుపతిరెడ్డి, బీసవేని రాజశేఖర్ గౌడ్, ముద్దం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

ఇల్లందకుంట: బాల్య వివాహాల నిర్మూలనపై ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాధవి మాట్లాడుతూ.. బాల్యవివాహాల పరిణామాలు వివరించారు. అదేవిధంగా ఐకేపీ సమావేశంలో బాల్యవివాహాలు, మిషన్ వాత్సల్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ సీడీపీవో భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, డాక్టర్ తులసిదాస్, ఎంఈవో, ఆలయ అర్చకులు, పాస్టర్, కరీంనగర్ డీసీపీవో శాంత, ఎస్సై తిరుపతి, ఐసీపీఎస్ రమేశ్, చైల్డ్ లైన్ నంబర్ 1098 ఇన్‌చార్జి కుమారస్వామి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. రైతులు, హమాలీలు, తాడికల్ సహకార సంఘం సీఈవో వేణు మాదవ్‌తో మాట్లాడారు. ధాన్యం తూకం వేయాలని సీఈవోకు సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

గంగాధర: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో మంగళవారం సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొత్తూరి సురేష్, మహంకాళి తిరుపతి, షమీమ్, నరేష్, మనోహర్, అలువాల అజయ్, సామెల్, ద్యావ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

చొప్పదండి: రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధి సాధించడంలో సఫాయి కార్మికుల భాగస్వామ్యం ఎంతో ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి సఫాయి కార్మికులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పల్లెలు, పట్టణాలకు అవార్డులు రావడం వెనుక కార్మికుల కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్తూరి మహేశ్, మహేశుని మల్లేశం, బాబర్ అలీ, గాంధి, మల్లేశం, అంజయ్య, లక్ష్మణ్, రవి, మొండయ్య, అంజి, లక్ష్మి, అనిల్, ప్రభాకర్, నర్సయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

గన్నేరువరం: కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాంబయ్యపల్లెలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అర్హులు కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి నర్సింహారెడ్డి, డాక్టర్ సందీప్ రెడ్డి, నాయకులు దుడ్డు మల్లేశం, భగవాన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గడ్డం గంగారెడ్డి, రమణారెడ్డి, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మిషన్, నిత్యావసర సరుకులు అందజేత

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన పల్లె రమ్యకు మంగళవారం మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ సభ్యులు కుట్టుమిషన్, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, దత్తు, నుగూరు వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ మురళీ, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రాజు, సర్పంచ్ జాడి లక్ష్మి, వీడీసీ రాజమల్లు, ఎంపీటీసీ హరీష్, ఉపసర్పంచ్ లింగయ్య పలువురు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో నెల రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. చివరి రోజు ఇందుర్తి, ఓగులాపూర్, అల్లునూర్ జట్లు పోటీపడగా ఫైనల్ మ్యాచ్‌లో అల్లునూర్ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు ఇందుర్తి ఎంపీటీసీ అందె స్వప్న, రన్నర్ జట్టు ఓగులాపూర్‌కు సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ కప్పులు అందించారు. లక్ష్మీచారిటబుల్ ట్రస్టు చైర్మన్ గాదె రఘునాథరెడ్డి గెలుపొందిన జట్టుకు రూ.పదివేలు ఇచ్చారు. ఐఓసీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు మహర్షి, పవన్, ప్రదీప్, లడ్డు, టింకు, హరీశ్, కుమార్, ప్రకాశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై అధికారుల విచారణ



గంగాధర: వివరాలు తెలుసుకుంటున్న అధికారి

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన రైతు భూమాల నాంపల్లికి సంబంధించిన భూ సమస్యపై మంగళవారం ట్రైనీ కలెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ విచారణ చేపట్టారు. 31 గుంటల భూమిని ధరణిలో వేరొకరి పేరుమీద నమోదు చేశారని తన పేరుమీదికి మార్చాలని ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ప్రజావాణిలో పదిసార్లు వినతిపత్రం ఇచ్చాడు. సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో సోమవారం ప్రజావాణికి పురుగులమందు డబ్బాతో రాగా అధికారులు అప్రమత్తమై మందుడబ్బాను తీసుకున్నా రు. కలెక్టర్‌కు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చా రు. ఈమేరకు ట్రైనీ కలెక్టర్ విచారణ చేపట్టి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు.

శంకరపట్నం: భూ సమస్యల ఫిర్యాదులపై తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ విచారణ చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కరీంనగర్ ప్రజావాణి, హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సంబంధిత పత్రాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ లక్ష్మారెడ్డి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్క్, క్రీడా ప్రాంగణం, ముదిరాజ్ గౌడ సంఘ నూతన భవనం ప్రారంభోత్సవం, యాదవ సంఘ నూతన భవనానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ నరసింహారావు, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సర్పంచ్ దేవ సతీష్‌రెడ్డి, కార్యదర్శి తార, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపడకుండా చూడాలి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు మంగళవారం రైస్‌మిల్లర్లు, రెవెన్యూ అధికారులతో మానకొండూర్‌లోని జీవీఆర్ నివాసంలో సమావేశమయ్యారు. మానకొండూర్ నియోజకవర్గంలో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, కల్లాల్లోని ధాన్యం తడిసి పోయిందని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. వ్యవసాయాధికారులు పంటల సర్వే పూర్తి చేసి నివేదిక తయారు చేయాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులు ఇబ్బందిపడకుండా చూడాలన్నారు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చిగురుమామిడి: హరితహారం విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కలు నాటేందుకు గ్రామాల్లో అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. మంగళవారం మండలపరిషత్ సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యం పూర్తిచేయడానికి తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. హరితహారంలో మండలాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అగ్రస్థానంలో నిలబెట్టాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమవంతు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు మిట్టపెల్లి మల్లేశం, మెడబోయిన తిరుపతి, సర్పంచ్‌లు సన్నీల్ల వెంకటేశం, జక్కుల రవి, సుద్దాల ప్రవీణ్‌కుమార్, ఐబీ డీఈఈలు ప్రశాంత్, చైతన్య, ఏఈ లు ఎండీ అజీజ్, రాకేశ్, మహేందర్, సుధీర్, ఈసీ రాజయ్య పలువురు పాల్గొన్నారు.

జమ్మికుంట: హరితహారం విజయవంతం చేయాలని ఎంపీడీవో కల్పన అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హరితహారంపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కెనాల్ ప్రక్కన స్థలాలను గుర్తించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు, మొక్కలు నాటాలని ఆదేశించారు. కార్యక్రమలో ఎంపీవో సతీష్‌కుమార్, ఇరిగేషన్, పీఎస్ కెనాల్,ఈజీఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో నాటుసారా ప్యాకెట్లు పట్టివేత

జమ్మికుంట: నాటుసారా అక్రమ రవాణా, అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో నాటుసారా అమ్మకాలు సాగిస్తున్న మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఓ మహిళ సారా అమ్మకాలు సాగిస్తుందనే సమాచారం మేరకు ఇంట్లో సోదాలు చేశారు. రెండు లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేశపట్నం మండలం మెట్‌పల్లి నుంచి నాటు సారా తీసుకువచ్చి విక్రయిస్తుందని, ఈమేరకు నిందితురాలిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సారా తయారీ, అమ్మకం చట్టరీత్యా నేరమని, లక్ష రూపాయల జరిమానా, పీడీ యాక్టు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కబీర్ దాస్, హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు మౌనిక, శైలజ తదితరులు పాల్గొనానరు.

కాంట్రాక్టు అధ్యాపకుల కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని 5,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండి రాజశేఖర్, రాష్ట్ర నాయకుడు దాసరి మహేష్, సిద్దిపేట జిల్లా నాయకుడు వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చిన్నక్క మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమాదేవి, ప్రభాకర్, సాయిచరణ్, సురేష్ తదితరులు ఉన్నారు.

జోగెత్తిన గౌడకులస్తులు



రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో శ్రీఎల్లమ్మతల్లి పట్నాల వేడుకల్లో భాగంగా మంగళవారం గౌడ కులస్తులు గడపావనం, ఎల్లమ్మ తల్లి విగ్రహంతో ఇంటింటికీ తిరుగుతూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జోగెత్తారు. కార్యక్రమం 6వ తేదీ వరకు నిర్వహిస్తామని శ్రీఎల్లమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గంగాధర్

శంకరపట్నం: విద్యుత్ పనులు చేసేటప్పుడు ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ వి. గంగాధర్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు గ్రామశివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. హుజూరాబాద్ డివిజన్ ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఈ చంద్రమౌళి, ఏఈలు సంపత్‌రెడ్డి, కుమారస్వామి, శ్రీనివాస్, వీరాచారి, తదితరులు పాల్గొన్నారు.